# మనం
## మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణ పేట, వనపర్తి

ఆదివారం 20 సెప్టెంబర్ 2026 పేజీలు 8 www.manamepaper.com





## మధ్యవర్తిత్వంతో
# సత్వర పరిష్కారం

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాస రావు**

**కోర్టుల్లో కేసులు ఉన్నవారు సమయం, డబ్బు వృథా చేసుకోకుండా మధ్యవర్తిత్వ వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాసరావు సూచించారు. కేంద్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు చేపట్టనున్న 'మధ్యవర్తిత్వం 3.0' ప్రచారంలో భాగంగా శనివారం కోర్టు హాలులో విలేకరుల సమావేశం నిర్వహించారు.**

వనపర్తి, సెప్టెంబర్ 20 (మనం ప్రతినిధి) : జిల్లాలో 15 మంది శిక్షణ పొందిన మధ్యవర్తులు అందుబాటులో ఉన్నారని, వైవాహిక, ఆస్తి, కుటుంబ, డబ్బు వివాదాలను నామమాత్రపు రుసుముతో పరిష్కరించుకోవచ్చని, రాజీ కుదిరితే కోర్టు ఫీజు తిరిగి చెల్లిస్తారని తెలిపారు. సమావేశంలో న్యాయమూర్తు లు లావణ్య, కళార్చన, కవిత, బార్ అధ్యక్షుడు కిరణ్, కార్యదర్శి వెంకటరమణ, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీపా కాసరగడ్డ తదితరులు పాల్గొన్నారు.



## కృష్ణా జలాల్లో తెలంగాణకు
# తీవ్ర అన్యాయం

**బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**ఎల్‌నినో పేరిట ఆంధ్రకు సాగుజలాలు దోచిపెడుతున్నారని, కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే తండ్రి లక్ష్మారెడ్డి మృతి చెందడంతో వారిని పరామర్శించేందుకు శనివారం కొల్లాపూర్ వచ్చిన ఆయన తిరుగు ప్రయాణంలో పెబ్బేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రకృతి కావాల్సినన్ని నీళ్లిచ్చినా రైతులకు సాగునీరు లేదని, ఉమ్మడి రాష్ట్రంలో 7 వేల మెగావాట్లు ఉన్న విద్యుత్ స్థాపిత సామర్థ్యాన్ని 24 వేల మెగావాట్లకు పెంచామని, కేసీఆర్ హయాంలో కృష్ణా జలాల్లో 30 శాతానికి పైగా వాడుకుని, పాలమూరులో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ లోకి తెచ్చి 7 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చామని గుర్తు చేశారు.**

వనపర్తి, సెప్టెంబర్ 20 (మనం ప్రతినిధి): ప్రస్తుతం రెండు సబ్ స్టేషన్లకు రైతులతో కలిసి వెళితే అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారని, ఆరు గంటలకు మించి కరెంట్ లేదని, లో ఓల్టేజీ, తరచూ కట్ చేస్తుండడంతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. నీళ్లు, కరెంట్ ఉన్నా ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ సర్కార్ ఉందని, సీఎం సొంత జిల్లాలోనే రైతులు రోడ్డెక్కుతున్నారని విమర్శించారు. జూరాలకు ఎగువ నుంచి నీళ్లు లేవని కాలువకు నీరు ఆపామని అధికారులు

- మిగతా 2లో..

## గణేష్ నిమజ్జనానికి
# పటిష్ట బందోబస్తు

**ఎస్పీ సునీతారెడ్డి**

వనపర్తి, సెప్టెంబర్ 20 (మనం ప్రతినిధి) : జిల్లాలో వినాయక నిమజ్జనాలు భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా నిర్వహించాలని ఎస్పీ సునీతా రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని

- మిగతా 2లో..



# కృష్ణా జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం



మొదటి పేజీ తరువాయి

చెబుతుంటే, పోతిరెడ్డిపాడు, వెలుగొండ ద్వారా ఏపీకి నీళ్లు పోతున్నాయని, కల్వకుర్తి పంపులు కంటిన్యూగా నడపాల్సి ఉండగా ఆన్ చేయడం లేదని ఆరోపించారు. కర్ణాటక ఆల్మట్టి ఎత్తును ఐదు మీటర్లు పెంచేందుకు లక్ష కోట్లు ఖర్చు పెడుతుంటే తెలంగాణ ప్రభుత్వం నిలదీయడం లేదని, దీంతో పాలమూరుకు భవిష్యత్తులో నీళ్లు రావని అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు అని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వి.శ్రీనివాస్ గౌడ్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర రెడ్డి, వనపర్తి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు గట్టు యాదవ్, నాయకులు నందిమల్ల అశోక్, కర్రే స్వామి తదితరులు పాల్గొన్నారు.



# డిండి వద్దు పాలమూరుకు నీళ్లు కావాలి

**పాలమూరు ప్రాజెక్టు లు పూర్తి చేయాలి**

**సీఎం జలదోపిడిని ఆపాలి**

**ఈనెల 27న రైతులతో కలిసి పాదయాత్ర ప్రారంభం**

మహబూబ్ నగర్, 19సెప్టెంబర్, (మనం న్యూస్) : డిండి లిఫ్ట్ ను వెంటనే రద్దు చేయాలని, మహబూబ్ నగర్ పెండింగ్ ప్రాజెక్టు లన్ని వెంటనే పూర్తి చేయాలని పెండింగ్ ప్రాజెక్ట ల సాధన కమిటీ డిమాండ్ చేసింది. పాలమూరు నీటిని డిండి పేరు తో నల్లగొండ జిల్లాకు తరలించడం అక్రమ విధానాన్ని ఆపాలని శనివారం చారగొండలో మీడియా సమావేశంలో జె ఏ సి జిల్లా చైర్మన్ రాజేందర్ రెడ్డి, రాఘవాచారి, వీర బ్రాహ్మాచారి, బెక్కెం జనార్ధన్ లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న నీటి చౌర్యాన్ని సహించేది లేదని ఆరోపించారు. 'డిండి' పేరుతో నల్లగొండకు నీళ్ల తరలింపు కుట్ర అని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల కేటాయింపులను దారి మళ్లిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో సాధించుకున్న 72జిఓను అమలు చేయాలని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గం లో ఉల్పర, సింగరాజుపల్లి వద్ద కాలువ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడి ప్రాంతం రైతులను నిండా ముంచి నల్లగొండ జిల్లాలోని గొట్టిముక్కలలో ప్రాజెక్టు నిర్మాణ పనులు ఇప్పటికే 70% పైగా పనులు పూర్తి అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు .పాలమూరు పెండింగ్ ప్రాజెక్టు లపై సీఎం కు ప్రేమ లేదు కానీ నల్లగొండ నాయకులకు బయపడి ఆ ప్రాంత ప్రాజెక్టు లకు బడ్జెట్ చెలిస్తూ పనులను వేగవంతం చేస్తున్నారని ద్యూయ్యబట్టారు. పాలమూరు రంగారెడ్డి పనులను చేయకుండా ఈ ప్రాజెక్టు బడ్జెట్ ను నల్లగొండ జిల్లాలో జరిగే ప్రాజెక్టు లకు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి డీపీఆర్ లేకుండానే టన్నెళ్లు, ప్రాజెక్టుల నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయం లో ప్రజాప్రతినిధుల జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మాట్లాడకపోవడం విచారకరమని, పాలమూరు బిడ్డ అయిన సీఎం కూడా స్పందించకపోతే బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు .

**పాదయాత్ర కు పిలుపు**

జలదోపిడిని సహించం మానీళ్లు మాకే కావాలని డిమాండ్ తో పాదయాత్ర కు పిలుపునిచ్చారు. ఈ జల ద్రోహాన్ని అడ్డుకోవడానికి మరియు డిండి లిఫ్ట్ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న ఉల్పర నుంచి బొట్టెముక్కల వరకు మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు ఈ పాదయాత్రలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు కోరారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

మొదటి పేజీ తరువాయి

నల్లచెరువు వద్ద నిమజ్జన ప్రాంతాన్ని డిఎస్పి గిరిబాబు, సీఐ సుగంధరత్నం లతో కలిసి శోభాయాత్ర రూట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిమజ్జనానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాల నిఘాలో శోభాయాత్ర సాగుతుందని, ఊరేగింపులో డీజేలు, బాణసంచా నిషేధమని తెలిపారు. గణేష్ ఉత్సవ కమిటీలు వెలుతురు ఉండగానే విగ్రహాలను తరలించాలని, క్రేన్ ద్వారా నిమజ్జనం సమయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ హరిప్రసాద్, రూరల్ ఎస్ఐ హృషికేష్, ట్రాఫిక్ ఎస్ఐ సురేందర్, మున్సిపల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





## విజయమే లక్ష్యంగా.. విద్యార్థులకు రేవల్లి యువత ప్రోత్సాహం

రేవల్లి, సెప్టెంబర్ 19 (మనం న్యూస్) : రేవల్లి మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న రేవల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను గ్రామ యువత ప్రోత్సహించింది. పోటీల్లో విజయం సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించింది. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి యువత ఉత్సాహంగా ఫొటోలు దిగుతూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ ప్రతిభను చాటుకోవాలని యువత ఆకాంక్షించింది.

# గణేష్ మండపాలలో అన్నదానం

నేరేడుచర్ల సెప్టెంబర్ 19 మనం న్యూస్ : అన్నదానానికి మించిన దానం మరొకటి లేదని నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి, నూకల సందీప్ రెడ్డిలు అన్నారు. శనివారం నేరేడుచర్ల లోని ఎస్ ఆర్ కె రెసిడెన్సీలో గణపతి నవరాత్రి ఉత్సవాల 6వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు తో కలిసి ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు అంటే కేవలం భజనలు, పూజలకే పరిమితం కాకుండా భక్తులకు ఒక్కరోజు అన్నదానం చేయడమంటే సాక్షాత్తు పరమశివుడికి నైవేద్యం పెట్టినట్లేనని అన్నారు. అలాంటి సాంప్రదాయాన్ని ప్రతి ఏడాది ఎస్ఆర్ కె రెసిడెన్సి వాసులు కొనసాగించడం అభినందనీయమని ప్రశంసించారు. ప్రశాంతమైన పండగ వాతావరణంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి సుమారు 2 వేల మంది భక్తులు తరలిరాగా సంతృప్తిగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అపార్ట్మెంట్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు బోనగిరి అంజయ్య,చిత్తనూరు రామకృష్ణ,అరిబండి కిరణ్ కుమార్, సుంకరి క్రాంతి కుమార్,కందిబండ హరిప్రసాద్,యీగా శ్రీనివాస రావు,రాచకొండ శ్రీనివాసరావు, రావులపల్లి రోశయ్య, చౌడిశెట్టి వెంకట సూర్యనారాయణ, కురువెళ్ల రవి, శ్రీరామ్ తరుణ్, వేమూరు నరేందర్,

# కల్వకుర్తిలో గణపతి మండపం వద్ద అపశృతి

### విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

కల్వకుర్తి సెప్టెంబర్ 19 (మనం న్యూస్) : కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ మైసమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద శుక్రవారం అర్ధరాత్రి విషాద ఘటన చోటు చేసుకుంది.. గణేష్ మండపానికి సంబంధించిన లైటింగ్ ను సరిచేస్తుండగా విద్యుత్ షాక్ కు గురై కల్వకుర్తి మండల పరిధిలోని తర్నికల్ గ్రామానికి చెందిన జంపుల అరవింద్ 26 అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసిన నేపథ్యంలో విద్యుత్ తీగలు తడిసి ఉండడంతో పాటు గణేష్ మండపం వద్ద లైటింగ్ కు సంబంధించిన తీగలు వేలాడుతూ ఉండడం వాటికి సపోర్టుగా ఉన్న జే వైరుకు విద్యుత్ ప్రసరణ జరగడం వల్లే ప్రమాదం సంభవించి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు.

### బీజేవైఎం నాయకుడిగా జంపుల అరవింద్ చురుకైన సేవలు

జంపుల అరవింద్ ఇటీవలే బీజేవైఎం కల్వకుర్తి మండల ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తనదైన శైలిలో సేవలందించినట్లు తోటి స్నేహితులు తెలిపారు. మంచితనం మానవత్వానికి మారుపేరుగా పేరొందిన జంపుల అరవింద్ ఆకస్మిక మృతితో తోటి స్నేహితులు పరిచయస్తులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న కల్వకుర్తి పోలీసులు వెంటనే ఘటన స్థలానికి వెళ్లి



మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుడి బంధువులకు అప్పగించినట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు.

### గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి

**కల్వకుర్తి ఎస్సై కురుమూర్తి**

గణేష్ మండపాల వద్ద విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేసిన సమయంలో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కల్వకుర్తి ఎస్సై కురుమూర్తి పేర్కొన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు ముఖ్యంగా వర్షాలు కురుస్తున్న సమయంలో విద్యుత్ తీగలు లైటింగ్ పరికరాలను నేరుగా తాగకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

### మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చిన బీజేపీ నేత తల్లోజు ఆచారి

గణేష్ మండపం వద్ద విద్యుత్ షాక్ కు గురై బీజేవైఎం కల్వకుర్తి మండల ప్రధానకార్యదర్శి జంపుల అరవింద్ మరణించడం బాధాకరమని జాతీయ బీసీ కమీషన్ మాజీ సభ్యుడు, బీజేపీ నేత తల్లోజు ఆచారి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ నేత తల్లోజు ఆచారి శనివారం కల్వకుర్తి మండల పరిధిలోని తర్నికల్ గ్రామానికి వెళ్లి మృతుడి పార్థివదేహానికి నివాళులర్పించి అతని కుటుంబసభ్యులను ఓదార్చారు. బీజేపీ పార్టీ తరుపున జంపుల అరవింద్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తల్లోజు ఆచారి వెంట స్థానిక బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.





## గోలి సుదర్శన్‌రెడ్డికి ఎమ్మెల్యే కసిరెడ్డి అభినందన

కల్వకుర్తి సెప్టెంబర్ 19 (మనం న్యూస్ : కల్వకుర్తి రెవిన్యూ డివిజన్ అగ్రికల్చర్ టెక్నాలజి మెనేజ్ మెంట్ చైర్మన్ గా నియామకమైన గోలి సుదర్శన్ రెడ్డి శనివారం హైదరాబాద్ నగరంలోని నివాసంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోలి సుదర్శన్ రెడ్డికు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అప్పగించిన బాధ్యతను వమ్ము చేయకుండా అనునిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా గోలి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేడీపల్లి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు,కుర్మిద్ద గ్రామ మాజీ ఉప సర్పంచ్ విజయ్ భాస్కర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు అజీం, తదితరులు పాల్గొన్నారు.



## పోషకహార ఆహార లోపాన్ని నివారించడానికే పోషక అభియాన్

### - తాసిల్దార్ ఉమ.. - చారకొండలో 9వ పోషక మాసం

చారకొండ,సెప్టెంబర్19(మనం న్యూస్) : పోషకాహార లోపాన్ని నివారించడానికే పోషక అభియాన్ అని తాసిల్దార్ ఉమ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో పోషక అభియాన్ 9వ పోషక మాసం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని ఐసిడిఎస్ సూపర్వైజర్, అంగన్వాడి టీచర్లు,ఆశా కార్యకర్తలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీలు,పిల్లల తల్లులు కౌమర బాలికలాలో పోషకాహార లోపాన్ని(రక్తహీనత) తగ్గించడానికి భారత ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. పిల్లలు ఎదుగుదల,బరువు తగ్గుట,మహిళలు కౌమర బాలికల రక్తహీనత శాతాని తగ్గించడానికి పోషక అభియాన్ కార్యక్రమాన్ని చేపడుతున్నారని తెలిపారు. అదేవిధంగా పాలిచ్చేతరులకు సరైన పౌష్టికాహారం అంగన్వాడీల ద్వారా అందే విధంగా కృషి చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కేసరి మల్లేష్,ఎంపీడీవో శంకర్ నాయక్,ఎంపీఓ నారాయణ,ఏపీఎం శ్రీనివాసులు,జిహెచ్‌ఎం భగవాన్ రెడ్డి, అంగన్వాడి సూపర్వైజర్,వైద్య సిబ్బంది,అంగన్వాడీ టీచర్లు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# కష్ట సమయంలో పలువురు అండగా

### గెల్వయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం

చారకొండ,సెప్టెంబర్19(మనం న్యూస్) : జేపల్లి గ్రామానికి చెందిన మాదుగుల గెల్వయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో జేపల్లి ఉప సర్పంచ్ వంకేశ్వరం మధు,మాజీ వార్డ్ మెంబర్ వెంకటేష్ లు గెలవయ్య కుటుంబాన్ని పరామర్శించి మేము ఉన్నాము అంటూ, కుటుంబానికి భరోసా కల్పించారు. తక్షణం సహాయం కింద మధు,వెంకటేష్ లు 50 కేజీల బియ్యాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబానికి కష్ట సమయంలో అండగా నిలిచి ఆదుకోవడం జరిగింది. ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటారు. అదేవిధంగా తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి గెల్వయ్య మృతి పట్ల సానుభూతి తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు బి,ఆర్,ఎస్,వి యువ నాయకులు తరుణ్ రాథోడ్ ద్వారా 4000 ఆర్థిక సాయంగా అందజేయడం జరిగింది. బిఆర్ఎస్ పార్టీపరంగా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు తెలియపరచారు. ఈ కార్యక్రమంలో వంకేశ్వరం రమేష్,మాజీ వార్డు మెంబర్ శేఖర్,బిఆర్ఎస్ నాయకులు ప్రశాంత్,గోపాల్ నాయక్,సత్యం,గ్రామ యువకులు మల్లేష్,కుటుంబ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.





# రేషన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నికలు

### ఈ నెల 28న సభ.. 12 ఏళ్ల పాత కమిటీ రద్దు

### అన్ని మండలాల డీలర్లు హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలి

**డీలర్ల సంఘం నాయకుడు కొత్తూరు సత్యం గుప్తా**

మిడ్జిల్ సెప్టెంబర్ 19 (మనం న్యూస్) : ఈ నెల 28న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో (చీ+టూ దీప్త్రుఝుఖుఅ) జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు డీలర్ల సంఘం నాయకుడు కొత్తూరు సత్యం గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 12 సంవత్సరాలుగా ఉన్న పాత కమిటీని రద్దు చేసి, సమర్థవంతమైన నూతన కమిటీని ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన రేషన్ డీలర్లు ఈ సమావేశానికి పెద్ద ఎత్తున తరలివచ్చి, నూతన కార్యవర్గ ఏర్పాటుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. టీఎన్‌జీవో భవనంలో జరిగే ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికయ్యే కమిటీ ద్వారా రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తగిన నిర్ణయాలు తీసుకుంటామని సత్యం గుప్తా పేర్కొన్నారు.

# గ్రామాలలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



చారకొండ, సెప్టెంబర్19(మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ,శనివారం మండల పరిధిలోని గోకారం,శాంతి గూడెం గ్రామంలో సర్పంచ్ లు పంజాగుల పరుశరములు,శిరీష,ఉప సర్పంచ్ అనిశెట్టి నాగేంద్ర ల సమక్షంలో రేషన్ కార్డుల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటీఎం మాదిరిగా రేషన్ కార్డు ఉంటుందని ఇందులో స్కాన్ చేస్తే కుటుంబ సభ్యుల వివరాలు తెలుస్తాయని,కనుక ప్రజలు రేషన్ కార్డును ఒక ఏటీఎం లాగా భద్రపరచుకొని ప్రభుత్వము అందిస్తున్న రేషన్ బియ్యం సద్వినియోగం చేసుకోవాలని రేషన్ కార్డు వినియోగదారులకు సూచించారు.స్మార్ట్ రేషన్ కార్డు ప్రతి ఒక్క కుటుంబ సభ్యులకి అందుతాయని తెలిపారు.కార్యక్రమంలో జిపిఓ ఆంజనేయులు, రాజు,వార్డు సభ్యులు, డీలర్ కొండల్,నాయకులు తస్నీరు రామకృష్ణ, లక్ష్మమ్మ,నాగేష్,గ్రామల పెద్దలు,ప్రజలు పాల్గొన్నారు.

# బహుజన రాజ్యాధికార సమరభేరి సభను జయప్రదం చేయాలి

### బీఎస్పీ జిల్లా అధ్యక్షులు మిద్దె మహేష్



వనపర్తి, సెప్టెంబర్ 20 (మనం ప్రతినిధి) : అక్టోబర్ 9న బడంగ్ పేట్ మున్సిపల్ గ్రౌండ్ లో నిర్వహించే బహుజన రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని బీఎస్పీ నాయకులు పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం అసెంబ్లీ అధ్యక్షులు దందురాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మిద్దె మహేష్ మాట్లాడుతూ.. వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్షీరాం 20వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ ఆధ్వర్యంలో సభ నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ రాజారామ్, 9 రాష్ట్రాల ఇంచార్జ్ హాజరవుతారని తెలిపారు. జనకళ్యాణ్ దివాస్ లో భాగంగా జనవరి 15న బీఎస్పీ అధినేత్రి మాయావతి జన్మదినం సందర్భంగా విరాళాల సేకరణ చేపట్టాలని, బీఎస్పీ ఎలక్టోరల్ బాండ్స్ తీసుకోదని, పేదల విరాళాలతో పేదల కోసమే పనిచేసే పార్టీ బీఎస్పీయేనని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ప్రకాష్, జిల్లా కార్యదర్శి ఆగుపోవు శ్రీనివాసులు, అసెంబ్లీ కోశాధికారి దొడ్డ శంకర్, బూత్ కమిటీ అధ్యక్షులు తప్పెట గోవర్ధన్, కల్మూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అభయహస్తం.. నిరుపేదల పాలిటి పెన్నిధి అభిమన్యు రెడ్డి

### చదువులకు, పెళ్లిళ్లకు, అంత్యక్రియలకు ఆర్థిక బాసటగా నిలుస్తున్న ప్రజా నాయకుడు

### జడ్చర్ల నియోజకవర్గానికి దొరికిన అరుదైన ఆణిముత్యం

**మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ప్రధాన అనుచరుడిగా.. బాలానగర్, రాజాపూర్ మండలాల అభిమాన నేతగా ప్రజల గుండెల్లో స్థానం**



రాజాపూర్ సెప్టెంబర్ 19 (మనం న్యూస్) : రాజకీయాలు అంటే కేవలం పదవులు, ప్రాతినిధ్యం మాత్రమే కాదని.. ప్రజాసేవే పరమావధి అని నిరూపిస్తున్నారు బిఆర్ఎస్ పార్టీ చురుకైన నాయకుడు అభిమన్యు రెడ్డి. నియోజకవర్గంలో ఆపదలో ఉన్నానంటే చాలు "నేనున్నానంటూ" అభయహస్తం అందిస్తూ నిరుపేదల పాలిటి దేవుడిగా అభిమానం పొందుతున్నారు.

**కష్టాల్లో ఉన్న వారికి కొండంత అండ**

పేదరికం కారణంగా చదువులకు దూరం కాకూడదని భావించి ఎంతో మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడమే కాకుండా, పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు తోచిన సాయం చేస్తూ కళ్యాణ కాంతులు నింపుతున్నారు. అంతేకాకుండా, పేద కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల ఖర్చులకు సహకారం అందిస్తూ కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నారు. ఆయన ఉదారత, సేవా గుణం జడ్చర్ల నియోజకవర్గానికి దొరికిన ఒక ఆణిముత్యంలా మారాయని స్థానిక ప్రజలు కొనియాడుతున్నారు.

**నమ్మిన సిద్ధాంతానికి, నాయకత్వానికి విధేయుడు**

బిఆర్ఎస్ పార్టీలో కీలక నేతగా వ్యవహరిస్తూ, మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డికి అత్యంత ప్రధాన అనుచరుడిగా అభిమన్యు రెడ్డి పేరుగాంచారు. లక్ష్మారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తున్నారు. ముఖ్యంగా బాలానగర్, రాజాపూర్ మండలాల్లో ఆయనకు ప్రజలు, కార్యకర్తలతో ప్రత్యేక అనుబంధం ఉంది. ప్రజలతో మమేకమవుతూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునే ఆయన శైలితో రెండు మండలాల అభిమాన నాయకుడిగా నీరాజనాలు అందుకుంటున్నారు. స్వార్థం లేని ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న అభిమన్యు రెడ్డి నాయకత్వం పట్ల జడ్చర్ల నియోజకవర్గ ప్రజలు, బిఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పెన్షన్ దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన

### అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు అధికారులు పరిశీలన



ఉప్పునుంతల, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సామాజిక భద్రతా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం ఉప్పునుంతల మండలంలోని ఉప్పరిపల్లి గ్రామంలో పంచాయతీరాజ్ ఏఈ మహేష్ పెన్షన్ దరఖాస్తుదారుల ఇళ్లను సందర్శించి అర్హతలను పరిశీలించారు. వితంతు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు తదితర కేటగిరీల కింద పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. దరఖాస్తుదారుల కుటుంబ పరిస్థితులు, జీవనోపాధి, సంబంధిత ధ్రువపత్రాలు తదితర అంశాలను క్షేత్రస్థాయి లో పరిశీలించి వివరాలను నమోదు చేశారు. అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పింఛన్ అందేలా ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ మహేష్‌తో పాటు గ్రామ సర్పంచ్ బొజ్జ గీత అమరేందర్ రెడ్డి, సీఎం ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ రేసోజు శ్రీనివాసాచారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు!

**భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు**

**ఐదో రోజు నిమజ్జన ఏర్పాట్లపై అధికారుల ప్రత్యేక దృష్టి**

**నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రాధాన్యం**

**క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్, కమిషనర్ గిరీష్**



మహబూబ్ నగర్, సెప్టెంబర్ 19 మనం ప్రతినిధి) : వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో జిల్లాలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఐదో రోజు వినాయక నిమజ్జనానికి భారీగా భక్తులు, ఉత్సవ కమిటీలు తరలివచ్చే అవకాశం ఉండటంతో మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు. నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్, మున్సిపల్ కమిషనర్ గిరీష్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల్లో పరిస్థితిని స్వయంగా పరిశీలించిన అధికారులు.. భక్తుల రద్దీ, విగ్రహాల తరలింపు, వాహనాల రాకపోకలు, పారిశుధ్యం వంటి అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

**భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యం**

నిమజ్జన ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, రహదారుల నిర్వహణ, అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. భారీగా ప్రజలు తరలివచ్చే పరిస్థితుల్లో చిన్నపాటి లోపం కూడా సమస్యగా మారకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వినాయక విగ్రహాలు నిమజ్జన ప్రాంతాలకు చేరుకునే మార్గాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వాహనాల రాకపోకలు, విగ్రహాల తరలింపు మార్గాలు, భక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు.

**పారిశుధ్యంపై నిర్లక్ష్యానికి తావులేదు**

నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భక్తుల రద్దీ కారణంగా చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నిమజ్జనం పూర్తయిన వెంటనే వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ.. నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్యం, భద్రత, మౌలిక సదుపాయాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని అధికారులకు స్పష్టం చేశారు.

**నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రత్యేక బృందాలు**

మున్సిపల్ కమిషనర్ గిరీష్ మాట్లాడుతూ.. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పారిశుధ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జనం అనంతరం వ్యర్థాలను తక్షణమే తొలగించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా మున్సిపల్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు.

**భక్తి ఉత్సవం.. భద్రతతో ముగింపు**

వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రజలు, ఉత్సవ కమిటీలు నిమజ్జన కార్యక్రమాన్ని కూడా ప్రశాంతంగా విజయవంతం చేయాలని అధికారులు కోరారు. భక్తి భావనకు ఎలాంటి ఆటంకం కలగకుండా, అదే సమయంలో భద్రత-పారిశుధ్యం-ట్రాఫిక్ నియంత్రణ విషయంలో రాజీ లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు అధికారులకు సహకరిస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం సజావుగా పూర్తవుతుందని అధికారులు పేర్కొన్నారు.

---

# గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యం

**అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలి**

**అధికారుల తీరుపై సభ్యుల అసంతృప్తి.. సమావేశంలో వాడివేడి చర్చ**



ఉప్పునుంతల, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా కృషి చేయాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సూచించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన అన్నారు. శనివారం ఉప్పునుంతల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీవో వరుణ్ తేజ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ద్వారా మండలంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు.

**అధికారుల పనితీరుపై సభ్యుల అసంతృప్తి**

సమావేశంలో పలువురు సభ్యులు అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల స్థాయి అధికారుల దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లినా వాటిపై తగిన స్పందన ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము సూచించిన సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని సభ్యులు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు గ్రామస్థాయిలో నిరంతరం పనిచేస్తున్న సర్పంచులకు అధికారులు తగిన గౌరవం, సహకారం అందించడం లేదని కొందరు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి, వారి సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

**వివిధ శాఖలపై సమీక్ష**

సమావేశంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్య, వైద్యం, వ్యవసాయం, ఐసీడీఎస్ తదితర శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఆయా శాఖల పరిధిలో అమలవుతున్న కార్యక్రమాలు, గ్రామాల్లో ఉన్న సమస్యలు, ప్రజలకు అందుతున్న సేవలపై సభ్యులు అధికారులను ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మండల అభివృద్ధికి సంబంధించి సభ్యులు చేసిన సూచనలను అధికారులు నమోదు చేసుకుని, వాటిపై తీసుకున్న చర్యలను తదుపరి సమావేశంలో వివరించాలని కోరారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సమావేశంలో సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వరుణ్ తేజ, తహసీల్దార్ అద్దంకి సునీత, సింగిల్ విండో చైర్మన్ మద్దు నరేందర్ రెడ్డి, మండల విద్యాశాఖాధికారి జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, వైద్యాధికారిణి డాక్టర్ స్వప్న, డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఐసీడీఎస్ బల్మూర్ ప్రాజెక్టు సీడీపీవో ధమయంతి, సూపర్‌వైజర్లు బిపాషా, పావని, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, మండల సర్వసభ్య సమావేశం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పదో తరగతి ప్రతిభావంతులకు ప్రోత్సాహకం

### 500కు పైగా మార్కులు సాధించిన 9 మంది విద్యార్థులకు నగదు, జ్ఞాపికలు

ఉప్పునుంతల, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు పెనిమెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 2025–26 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 500కు పైగా మార్కులు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులను అభినందిస్తూ నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలను అందజేశారు. స్వర్గీయ మర్యాద వెంకట్ రెడ్డి జ్ఞాపకార్థం మర్యాద రేవతి కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మేడసాని శ్రీలత విజేందర్ రెడ్డి విద్యార్థులను అభినందించి ప్రోత్సాహకాలను అందజేశారు. చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి సత్కరించడం ద్వారా ఇతర విద్యార్థుల్లోనూ స్ఫూర్తి కలుగుతుందని కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేడసాని శ్రీలత విజేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువులో పోటీతత్వాన్ని పెంపొందించుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు క్రమశిక్షణతో చదువుతూ ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ప్రతిభను మెరుగుపరుచుకొని ఉన్నత విద్యా అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు.

**అదనపు గదులకు త్వరలో నిధులు**

పెనిమెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనానికి అదనపు గదుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించినట్లు సర్పంచ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి రాష్ట్ర సర్వశిక్ష అభియాన్ స్థాయి వరకు సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సాహకాలు అందించడం పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచడంతో పాటు భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడతాయని తెలిపారు. మర్యాద రేవతి కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గణేశ్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలు, ఐక్యతకు ప్రతీక

**జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్ రెడ్డి**

**మిడ్జిల్‌లో ఘనంగా జీపీ గణనాథుని నిమజ్జనోత్సవం**

**లక్కీడిప్‌లో లడ్డూ దక్కించుకున్న తంగెళ్ల నవీన్ రెడ్డి**

**హాజరైన మిడ్జిల్ సర్పంచ్ ఎడ్ల శంకర్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు**

మిడ్జిల్ సెప్టెంబర్ 19(మనం న్యూస్) : గణేశ్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలకు, గ్రామీణ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్ రెడ్డి, సర్పంచ్ ఎడ్ల శంకర్ తెలిపారు.



మిడ్జిల్ మండల కేంద్రంలో గ్రామ పంచా యతీ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుని నిమజ్జనోత్సవం శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా ముగిసింది. జ్యోతి అల్వాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు.

**ఆకట్టుకున్న లడ్డూ లక్కీడిప్**

ఈ నిమజ్జనోత్సవం సందర్భంగా నిర్వహించిన స్వామివారి లడ్డూ లక్కీడిప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ లక్కీడిప్‌లో మిడ్జిల్ గ్రామానికి చెందిన తంగెళ్ల నవీన్ రెడ్డి స్వామివారి ప్రసాద లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గౌస్, గ్రామ సర్పంచ్ ఎడ్ల శంకర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కోట్ల పర్వతాలు మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాల విశిష్టతను, నిమజ్జన కార్యక్రమాల నిర్వహణ తీరును ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేడిపల్లి నరేందర్ రెడ్డి, మిడ్జిల్ ప్రెస్ క్లబ్ చైర్మన్ మేడిపల్లి బాల్ రెడ్డి,వార్డు సభ్యులు మద్ది లక్ష్మా రెడ్డి, రమేష్, మమత కృష్ణ, లాలు, జగదీష్ ముదిరాజ్, శివ,రామ్ గౌడ్, అదము ఆంజనేయులు.తదితరులతో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు.

# కిసాన్ మేళాకు హాజరైన వంగూర్ మండల రైతులు

**ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వ్యవసాయ శాఖ ముందస్తు జాగ్రత్తలు**




వంగూర్ సెప్టెంబర్ 19 ( మనం న్యూస్) : నాగర్ కర్నూల్ జిల్లా పాలెం గ్రామంలో కిసాన్ మేళా సందర్భంగా నిర్వహించిన వ్యవసాయ ప్రదర్శనకు వంగూర్ మండలానికి చెందిన పోల్కంపల్లి జాజాల గ్రామాల నుండి పలువురు రైతులు హాజరై నూతన వ్యవసాయ పద్ధతులు, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పొందారు. వివిధ రకాల విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్ర పరికరాలు, పంటల సంరక్షణ విధానాలను రైతులు ఆసక్తిగా పరిశీలించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రీయ పద్ధతులను పాటించాలని తెలిపారు. కిసాన్ మేళా తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని రైతులు పేర్కొన్నారు. నూతన పంటల సాగు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ తదితర అంశాలపై నిపుణుల నుంచి తెలుసుకోవడం ఎంతో ప్రయోజనకరంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండలానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు మండల వ్యవసాయ శాఖ వారికి కృతజ్ఞతలు తెలియజేసారు.

# న్యాయవాదులు నిత్య విద్యార్థులే

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత**

**పీయూలో మ్యూట్ కోర్టును లీగల్ ఎయిడ్ ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీయూ వైస్ చాన్స్ లర్**



మహబూబ్ నగర్ లీగల్,19 సెప్టెంబర్, (మనం న్యూస్) : న్యాయవాదులు నిత్య విద్యార్థులని ఎప్పుడు చదువుతూనే ఉండాలని, కొత్త విషయాలు తెలుసుకుంటూనే ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత అన్నారు. శనివారం పీయూ లా కళాశాల ఆధ్వర్యంలో అకాడమిక్ ఆడిటోరియం లో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పీయూ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్ బాబు, ఉస్మానియా యూనివర్సిటీ లా డీన్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, బి.ఓ. ఎస్ చైర్మన్ ప్రొఫెసర్ రాంప్రసాద్ తో కలిసి మ్యూట్ కోర్టును లీగల్ ఎయిడ్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, సర్దార్ వల్లభభాయ్ పటేల్ వంటి ప్రముఖులు న్యాయశాస్త్రాన్ని అభ్యసించారని తెలిపారు. విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకొని న్యాయ శాస్త్రం పట్టు సాధించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా లీగల్ ఎయిడ్ క్లినికల్ ద్వారా పేదలు, పీడిత వర్గాలకు న్యాయ సహాయం అందించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలు, మహిళలు, వలస కార్మికులు, సీనియర్ సిటిజన్లు ఎదుర్కొనే సమస్యలపై న్యాయ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని అన్నారు. భవిష్యత్ న్యాయవాదులు క్లయింట్ల నుంచి పూర్తి వివరాలను సేకరించి కేసులను సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు.దశాబ్దాల నుంచి పెండింగ్ లో ఉన్న కేసు లను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చునని అన్నారు . విద్యార్థులు సివిల్ ,క్రిమినల్ , యాక్సిడెంట్ కేసులను ఇతర అన్ని రకాల కేసు లను బాగా చదవాలని , ఆర్గ్యుమెంట్, డ్రాఫ్టింగ్, లాంగ్వేజ్ పై పట్టు సాధించేలా సాధన చేయాలని అన్నారు. లీగల్ విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు . న్యాయ శాస్త్ర విభాగ విద్యార్థులు ప్రధానంగా నైతిక విలువలను పాటించాలన్నారు. ఏఐబిఈ పాస్ కావాలని, కోర్టులో రిప్రజెంట్ ,కోర్టు ప్రొసీడింగ్స్ కోర్టు వాతావరణం గురించి విద్యార్థులకు వివరించారు. న్యాయవాదులు తార్కిక ఆలోచనతో, ఆధారాలతో వాదనలు వినిపించాలని సూచించారు. నిర్మాణాత్మక విమర్శలను స్వీకరిస్తూ నైతిక విలువలను పాటించాలని అన్నారు.అనంతరం వీసీ ప్రొఫెసర్ జీఎన్. శ్రీనివాస్ లీగల్ ఎడ్యుకేషన్ అబ్జర్వెన్స్ క్యాలెండరు ను అతిథిలతో కలిసి ఆవిష్కరించి పేదలు, సామాన్య ప్రజలకు న్యాయం అందించడమే న్యాయవృత్తి ప్రధాన ధర్మమని అన్నారు.న్యాయ విద్య కేవలం పుస్తకాలు, చట్టాల అధ్యయనానికే పరిమితం కాకుండా సమాజంలోని వాస్తవ సమస్యలను అర్థం చేసుకునేలా ఉండాలని అన్నారు. న్యాయవాదులు సమాజంలోని బలహీన వర్గాలు, పేదలు, మహిళలు, నిరుపేదలకు న్యాయం అందించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. లా కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఆధునిక సౌకర్యాలతో కూడిన గ్రంథాలయం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని న్యాయ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థులు ప్రాక్టికల్ సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ మూక్ కోర్టులు, లీగల్ ఎయిడ్ కార్యక్రమాలు, సెమినార్లు, కాన్ఫరెన్సులు, వర్క్‌షాపుల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. న్యాయ విద్యార్థులు సమాజంలో జరుగుతున్న పరిణామాలు, చట్టాల్లో వస్తున్న మార్పులపై నిరంతరం అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఇటువంటి విద్యా, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు యూనివర్సిటీ తరఫున అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు. హాస్టల్ నిర్మాణ పనులు త్వరలో పూర్తవుతాయని పేర్కొన్నారు. భవిష్యత్ న్యాయవాదులు వృత్తిపరమైన నైపుణ్యాలతో పాటు నైతిక విలువలను పాటిస్తూ సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ప్రొఫెసర్ చంద్రకిరణ్, డీన్ వెంకటేశ్వర్లు, బీఓఎస్ ఆఫ్ ఓయూ చైర్మన్ రాంప్రసాద్, లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భూమయ్య, ఎంఈఓ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి,సీనియర్ న్యాయవాది య్.రవి కుమార్ యాదవ్, విభాగాధిపతి వెంకట సాయిప్రసాద్, అధ్యాపకులు కిరణ్, శ్రీకాంత్, ప్రియాంక, అశోక్, అక్షయ, విద్యార్థులు పాల్గొన్నారు.



# యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా డెల్ కంపెనీతో టాస్క్ ఒప్పందం

**ఉదాన్ ద్వారా 5500**
**యువత భవిష్యత్ టెక్ శిక్షణ**

**ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి భేటీ**



కల్వకుర్తి సెప్టెంబర్ 19 (మనం న్యూస్) : తెలంగాణ యువతను భవిష్యత్ సాంకేతిక రంగానికి సిద్ధం చేస్తూ, నైపుణ్యాల ఆధారంగా ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు ముందుకు వేస్తూ టాస్క్ ప్రముఖ టెక్ దిగ్గజం డెల్ టెక్నాలజీస్ మధ్య " కార్యక్రమం అమలుకు అవగాహన ఒప్పందం కుదిరిందని శనివారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన ఆయన కార్యాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఐటీడసి జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి ఐఏఎస్, రాష్ట్ర కౌన్సిల్ సెక్రటరీ రామ్,టాస్క్ సీఈవో నితిన్ కుమార్ రెడ్డి లతో కలిసి టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

**దేశ వ్యాప్తంగా తెలంగాణకు ప్రత్యేక అవకాశం**

డెల్ టెక్నాలజీస్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా దేశవ్యాప్తంగా ఐదు ప్రధాన టెక్నాలజీ కేంద్రాల్లో ఉదాన్ కార్యక్రమాన్ని అమలు చేయనుందని హైదరాబాద్ నగరాన్ని కీలక కేంద్రంగా ఎంపిక చేయడం విశేషమని టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు చొరవతో రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ లభించనుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

**విద్య నుంచి ఉద్యోగం వరకు 25 కేంద్రాల్లో 3 నెలల శిక్షణ**

ఉదాన్ ద్వారా యువతను నైపుణ్యాలతో శక్తివంతం చేసి,విద్య నుంచి పరిశ్రమల వైపు, నైపుణ్యం నుంచి ఉపాధి వైపు నడిపించే కార్యక్రమని అన్నారు. రాష్ట్రంలో 5,500 మంది విద్యార్థులకు 25 కేంద్రాల్లో మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.ఐఐటి డెల్ రూపొందించిన పాఠ్య ప్రణాళిక ఆధారంగా కృత్రిమ మేధ (AI),క్లౌడ్ కంప్యూటింగ్,ఎలక్ట్రానిక్స్ తయారీ,డిజిటల్ నైపుణ్యాలపై డెల్ టెక్నాలజీస్ సాంకేతిక సహకారం అందించనుందని పేర్కొన్నారు.యువతకు ఉదాన్ ద్వారా కేవలం శిక్షణే కాదు,మారుతున్న పరిశ్రమల అవసరాలకు తగ్గ నైపుణ్యాలను అందించి,శిక్షణ అనంతరం ఉద్యోగాలు,స్వయం ఉపాధి దిశగా సమగ్ర మార్గాన్ని చూపిస్తామని ముఖ్యంగా గ్రామీణ యువతకు కూడా ఈ అవకాశాలు అందుతాయని ఈ సందర్భంగా టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు.



# దేవుని సన్నిధిలో దందా



ఊరుకొండ సెప్టెంబర్ 19 (మనం న్యూస్) : స్థానిక మండల పరిధి ఊరుకొండ పేట గ్రామపంచాయతీలో శ్రీ శ్రీ శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం ఆగస్టు 24న మనం ప్రత్యేకంగా ప్రచురించిన వార్త కథనశీ "పూజారుల ప్రతాపం..పిండుడు ప్రయోగం".అనే శీర్షిక భక్తజన హృదయాలను కలచివేసింది.ఈ దురాగాతాలపై నేటి వరకు పూజారులపై తీసుకున్న చర్యలేవి? అని ప్రశ్నిస్తే ఆలయ కార్యనిర్వాహణాధికారి నుంచి వస్తున్నది కేవలం శూన్య హస్తమే?గుడికి వచ్చే భక్తుడి గుండెల్లో భక్తిని పెంచాల్సింది పోయి.భక్తుల కీసలకు చిల్లులు కొడుతున్నారు.కొందరు అర్చకులు హారతి పళ్లెంలో కాసులు పడకపోతే దిగదుడుపే 'హారతి లేని దక్షిణ' ఇవ్వకపోతే దేవుడు దర్శనం కూడా సరిగ్గా చేయించని 'దక్షిణ పీడకలు'.రాజ్యమేలుతుంటే ఆలయ అధికారి మాత్రం కళ్ళున్న చూడలేని,చెవులున్న వినలేని,ధ్రుతరాష్ట్ర పాత్రను పోషిస్తున్నారు.ఆగస్టు 24 న కథనంతో గుడి గుట్టు రట్టైన,నేటికీ పూజారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనక ఉన్న మర్మమేమిటి? ఈ నిమ్మకు నీరుతిన చందమేమిటని భక్తుల ఆవేదన.పవిత్రమైన ఆలయ ప్రాంగణం పాపపు పంకిలంగా మారుతుంది.కర్పూర పరిమళాలు వేదజల్లాల్చిన గర్భాలయం,కాసుల కంపుతో కొట్టుమిట్టాడుతుంది? నిష్కలమైన భక్తితో వచ్చే సామాన్య భక్తుడు.ఇక్కడి "ధన" ప్రతాపానికి బలైపోతున్నాడు.తప్పు చేసిన పూజారులను అడ్డుకోవలసిన అధికారి,చట్టాన్ని చాప కింద చుట్టేసి,విచారణల పేరిట కాలయాపన చేయడం ఘోరమైన అపరాధం.దేవుని సన్నిధిలో జరుగుతున్న ఈ దందాను అరికట్టాలి.లేని పక్షంలో,భక్తుల ఆగ్రహ జ్వాలల్లో ఆలయ అధికారుల నిర్లక్ష్యం కాలి బూడిదవడం ఖాయం!అధికారం చేతిలో ఉన్న అసమర్థతగా మిగిలిపోవడం ఈవో పదవికే అవమానం.కళ్ళు దుటే అక్రమాలు జరుగుతున్న కనురెప్పలు మూసుకొని కూర్చోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి? ఆవరణలో అన్యాయం జరుగుతుంటే,ఆఫీసు గదుల్లో ఏ, సి ల కింద కూర్చొని సమీక్షలు చేయడం వల్ల వచ్చే లాభాలు ఏమిటి? చర్యలు శూన్యం?ఇక్కడ భక్తుల ఆక్రందనలు అరణ్యరోధనం?దేవుని సేవలో తరించాల్సిన క్షేత్రం.దందాలకు వేదిక అవుతుంటే,అధికారం ముద్ర వేసుకున్న అధికారులు ఎందుకు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు?పూజారుల పీడనపై పత్రికలు కోడై కూస్తున్న,భక్తుల గొంతు చించుకుంటున్న,నేటి వరకు తీసుకున్న కఠిన చర్యల చిట్టా ఏది? కేవలం నోటీసులతో కాలయాపన చేయడమేనా మీ కర్తవ్యం? లేక నివేదికల పేరుతో కాలగర్భంలో కలపడమేనా మీ నైజశీ? దేవుడు సొమ్ము దేవుడికే చెందాలి.భక్తుల నమ్మకం నిలబడాలి.ఈవో సత్య చంద్రారెడ్డి మీ మౌనాన్ని వీడండి?అవినీతి తిమింగలల వేటను ప్రారంభించండి.తప్పు చేసిన వారిపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలను బహిరంగపరచండి?లేదంటే ఆ పాపం సొమ్ములో మీకు భాగశీ ఉందని భక్తుల అనుమానం భావించగా తప్పదు? మనం వార్తా కథనం భక్తుల పక్షాన పోరాటాన్ని ఆపదు.విశ్రమించదు?మీ చర్యలు తేలే వరకు.

# అక్రమ మద్యంపై ఎక్సైజ్ అధికారుల ఉక్కుపాదం

**భారీగా నిల్వలు..స్వాధీనం**

**అబ్కారీ మద్యపాన నిషేధ ఉన్నత అధికారి రవి చంద్రారెడ్డి**



ఊరుకొండ సెప్టెంబర్ 19 (మనం న్యూస్) : స్థానిక మండల పరిధిలోని శనివారం రాచాలపల్లి గ్రామపంచాయతీలో ఈఎస్ఐ చాంద్ బి ఆధ్వర్యంలో మద్యపాన అధికారి నిషేధపు అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు.మూడవత్ రాందాస్ సక్రు పై కేసు నమోదు చేశారు.జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ మద్యం,తయారీ,నిల్వలా విక్రయాలపై,ప్రత్యేక తనిఖీ నిర్వహిస్తూ,పట్టుబడిన భారీ మద్యం స్వాధీనం చేసుకున్నారు.ఈ నేపథ్యంలో మద్యపాన అబ్కారి నిషేధ అధికారి అక్రమంగా తయారు చేస్తున్న మద్యం పై ఉక్కు పాదం మోపుతామని,సమాజ ఆరోగ్యానికి ముప్పుగా పరిణమించిన నాటుసార వ్యాపారానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యం.ఈ తనిఖీల్లో భాగంగా రహస్యంగా నిల్వ ఉంచిన 10 లీటర్ల లిక్కర్ (నాటు సారా) 2 కిలోల (పట్టిక )అలం అక్రమ మద్యం తయారు సిద్ధం చేసిన 100 లీటర్ల లిక్కర్ వాష్ స్వాధీనం.అక్రమార్కుల గుర్తు రట్టు చేస్తూ ఎక్సైజ్ సిబ్బంది ఈ రసాయనాలను సీజ్ చేశారు.ప్రజల ప్రాణాలతో ప్రాణాలతో చెలగాటమాడుతూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఇలాంటి అక్రమ సారాల వ్యాపారాలపై రాబోయే రోజుల్లో కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అక్రమ నిల్వలకు కారణమైన వారిపై చర్యలు నమోదు చేసినట్లు దర్యాప్తులో వెల్లడించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సిబ్బంది పాల్గొన్నారు..

# ఈ నెల 20న జగిత్యాలలో బాం సెఫ్ మహాసభ

**బాంసెఫ్ తెలంగాణ రాష్ట్ర 13వ మహాసభను విజయవంతం చేయండి**

**పోస్టర్ ఆవిష్కరణ చేసిన బాం సెఫ్ రాష్ట్ర కార్యదర్శి పట్నం చెన్నయ్య**

మహబూబ్ నగర్, 19సెప్టెంబర్,( మనం న్యూస్) : జగిత్యాల జిల్లాలో బాం సెఫ్ 13వ రాష్ట్ర మహా సభ ఘనంగా నిర్వహించడం జరుగుతుందని బామ్ సెఫ్ రాష్ట్ర కార్యదర్శి పట్నం చెన్నయ్య అన్నారు. శనివారం ఆసంఘం నాయకులు జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో మహాసభల వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల బహుజన సంఘాల ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల మేధావులు సభ్యులు ఉద్యోగులు ఈనెల 20 వ తేదీన జగిత్యాల లో జరిగే మహాసభకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. మహాసభ లో బీసీ ల జనగణన, ఎస్సి, ఎస్టీ లపై జరుగుతున్న దాడులు,బహుజనుల హక్కులు, మూఢనమ్మకాలు నిర్మూలన చట్టం మొదలగు అంశాలపై చర్చ ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో నాస్తిక సమాజ సభ్యులు డి విజయ్ కుమార్, గూడూరు సామెల్ నాస్తిక సమాజం జిల్లా ఇన్చార్జి దానగల రవికుమార్, ఉపాధ్యక్షులు దళిత పాంథర్ సభ్యులు విజయకుమార్, దేశ నాయక్, వెంకటేష్ వెంకటేష్ లు తెలిపారు.



# సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలి

**గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన చిన్నారులు**

వంగూర్ సెప్టెంబర్ 19 ( మనం న్యూస్) : వంగూరు మండల పరిధిలోగల పోల్కంపల్లి గ్రామంలో చిన్నారులు వినాయక మండపం దగ్గర పూజా కార్యక్రమం నిర్వహించారు అనంతరం చిన్నారులు భక్తితో గణపతిని ఈ విధంగా కోరుకున్నారు సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండి రైతుల కల్లాల్లో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ చిన్నారులు గణపతికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా గణపతి విగ్రహం వద్ద పూజలు చేసి, రైతులకు మంచి దిగుబడులు రావాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా చిన్నారులు భక్తి శ్రద్ధలతో గణపతికి పూలు, పండ్లు సమర్పించి, వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకున్నారు. రైతుల కష్టాలు తొలగి పంటలు పచ్చగా కళకళలాడాలని, ప్రతి రైతు కుటుంబంలో సంతోషం నెలకొనాలని ఆకాంక్షించారు. చిన్నారుల భక్తి, రైతుల సంక్షేమంపై వారి ఆలోచనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సల్వాది శివ కోటి జగదీష్ వరుణ్ రాకేష్ వరుణ్ శివానంద్ కౌశిక్ వివేకానంద అలెగ్జాండర్ జగదీశ్వర సచిన్ జ్ఞాని పాల్గొన్నారు.



# వైభవంగా గణేష్ నిమజ్జనం

## భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు..

### నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

అచ్చంపేట, సెప్టెంబర్ 19 (మనం న్యూస్): అచ్చంపేట పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను భక్తులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, ప్రజలు ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు.



**గణనాథుడికి ప్రత్యేక పూజలు**

గణేష్ నిమజ్జన కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం పట్టణ ప్రముఖులు, గణేష్ విగ్రహాల ఏర్పాటు నిర్వాహకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులతో కలిసి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు**

నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను, ప్రజలను ఆకట్టుకున్నాయి. భక్తులు, యువత, ఉత్సవ కమిటీ సభ్యులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని గణనాథుడికి వీడ్కోలు పలికారు. పట్టణమంతా భక్తి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పట్టణ ప్రజలకు, భక్తులకు గణేష్ నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# పునరాగమన పయనం.. ప్రకృతిలో లీనం

## గంగమ్మ ఒడికి గజముఖుడు..జ్ఞాన దీప్తికి నవపథముడు

### రెయిన్బో ప్రైవేట్ పాఠశాల కరెంట్స్పాండెంట్ లక్ష్మీనారాయణ

ఊరుకొండ సెప్టెంబర్ 19 (మనం న్యూస్) : స్థానిక మండల పరిధిలోని శనివారం రెయిన్బో ప్రైవేట్ పాఠశాలలో గణనాథుని నిమజ్జనం కనుల పండుగగా శోభయానకంగా ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగాయి. ఈ నేపథ్యంలో పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ గణనాథుని ప్రాముఖ్యతను వివరిస్తూ వ్యాఖ్యానిస్తూ...విద్యలక అధిపతి విఘ్న నివారణకుడవైన,ఆ గణనాథుడు ఉత్సవాల ముగించుకొని,వీడ్కోలు పలికే వేళ రాణి వచ్చింది.జ్ఞాన దేవాలయమైన మా పాఠశాల ప్రాంగణం భక్తి భావంతో పులకించిపోయింది.సృష్టి,స్థితి,లయనే,సనాతన సత్యాన్ని చాటి చెప్పే నిమజ్జన మహోత్సవం మా విద్యార్థుల్లోకంలో ఒక కొత్త నూతన ఉత్తేజాన్ని సదవగాహలను నింపింది.ఈ ఉదయం మా బడి తోట భక్తి పాటల మేలవింపుతో,చిరునవ్వుల హరివిల్లుతో మురిసిపోయింది.హారతుల వెలుగులు విద్యార్థుల అడుగులు.భజన చప్పుళ్ళ భక్తి భావాల ఉప్పెనలు.రంగురంగుల తోరణాలు ఒకవైపు మంగళకరమైన మంత్రోచ్చారణలు మరోవైపు.సమ్మోహన వాతావరణ సృష్టించాయి.ఆ లంబోదరుని లీలలను కొనియాలతో బాలలంతా ఏకతాటిపై నిలిచి,ఆడిన ఆటలో పాడిన పాటలు ముల్లోకల దేవతలను మురిపించేలా చేశాయి.నిమజ్జనం అంటే కేవలం విగ్రహాన్ని నీటిలో కలపడం కాదు,అది అహంకారాన్ని అంతమొందించి,పరమాత్మలో ఐక్యం కావాలనే జీవన పాఠం.చదువుల తల్లి ఒడిలో ఎదిగే విద్యార్థులకు ఈ ఉత్సవం ఐక్యతను,క్రమశిక్షణను నేర్పింది.మట్టి రూపాన్ని జలంలో నిమజ్జనం చేసినట్లుగానే,మాలోని నిర్లక్ష్యాన్ని అజ్ఞానాన్ని విడనాని,జ్ఞానమార్గంలో పయనించాలని గొప్ప సందేశాన్ని ఈ వేడుకమ్మ అందించింది.ఆది పూజ్యుడికి వీడుకోలు పలుకుతూ,కనులు చిమర్చిన హృదయాలు భక్తితో నిండాయి.మరుసటి ఏడాది మళ్లీ చదువుల వెలుగుల నింపడానికి త్వరగా రావాలని ఆ బాల గణపతిని వేడుకున్నాము.మా పాఠశాలలో జరిగిన ఈ విఘ్నేశ్వరుని నిమజ్జనం సంబరం ఒక పండుగ కాదు,అది సంప్రదాయానికి,సాహిత్యానికి,భక్తికి,బాధ్యతకు పట్టిన అద్దం అని మరోసారి నిరూపించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చిన్నారులు,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# క్రీడా మైదానంలో ప్రతిభ.. భవిష్యత్తుకు బలమైన పునాది



రేవల్లి, సెప్టెంబర్ 19 (మనం న్యూస్) : మండల కేంద్రం రేవల్లిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రేవల్లి క్రీడా ప్రాంగణంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పాల్గొన్నారు. పోటీలను రేవల్లి గ్రామ సర్పంచ్ రాజయ్య, మండల అభివృద్ధి అధికారిణి కీర్తన, మండల విద్యాధికారి ఎస్. వరప్రసాద్ రావు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పి. ప్రసాద్, జిల్లా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రామమూర్తి తదితరులు ప్రారంభించారు. వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయుల సమన్వయంతో పోటీలు సాయంత్రం వరకు కొనసాగాయి. విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ హోరాహోరీగా పోటీపడ్డారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కుమార్, మండల అభివృద్ధి అధికారిణి కీర్తన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కబడ్డీ బాలికల విభాగంలో కేజీబీవీ రేవల్లి ప్రథమ, జడ్పీహెచ్ఎస్ రేవల్లి ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాలుర కబడ్డీలో జడ్పీహెచ్ఎస్ రేవల్లి ప్రథమ, జడ్పీహెచ్ఎస్ నాగపూర్ ద్వితీయ స్థానాన్ని సాధించాయి. ఖోఖో బాలికల్లో జడ్పీహెచ్ఎస్ నాగపూర్ ప్రథమ, జడ్పీహెచ్ఎస్ రేవల్లి ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఖోఖో బాలురలో జడ్పీహెచ్ఎస్ నాగపూర్ ప్రథమ, జడ్పీహెచ్ఎస్ తలుపునూరు ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాయి. వాలీబాల్ బాలుర విభాగంలో జడ్పీహెచ్ఎస్ రేవల్లి ప్రథమ, జడ్పీహెచ్ఎస్ తలుపునూరు ద్వితీయ స్థానంలో నిలిచాయి.

**క్రీడలతో వ్యక్తిత్వ వికాసం**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. క్రీడల్లో నిరంతరం పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. జట్టుగా పనిచేయడం, గెలుపోటములను సమానంగా స్వీకరించడం, లక్ష్య సాధన కోసం కృషి చేయడం వంటి విలువలు క్రీడల ద్వారా అలవడతాయి. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిబంధనలకు అనుగుణంగా విద్యా ప్రవేశాలు, క్రీడా కోటా, వివిధ ఉద్యోగ అవకాశాల్లో ప్రయోజనాలు లభించే అవకాశం ఉంటుంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభను చాటితే మరిన్ని ఉన్నత అవకాశాలకు మార్గం ఏర్పడుతుంది. అందువల్ల విద్యార్థులు చదువుతో పాటు తమకు ఆసక్తి ఉన్న క్రీడను ఎంచుకుని సాధన చేయాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలని నిర్వాహకులు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని, పాఠశాల స్థాయి నుంచే ప్రతిభను గుర్తించి సరైన ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.

# విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ

ఉమ్మడి గోపాల్‌పేట, సెప్టెంబర్ 19 (మనం న్యూస్) : గోపాల్‌పేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫాంలను గ్రామ సర్పంచ్ గురుగుల బంగారయ్య శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులకు యూనిఫాంలు అందజేయడంతో వారిలో ఉత్సాహం కనిపించింది. ఈ సందర్భంగా సర్పంచ్ బంగారయ్య మాట్లాడుతూ విద్య ప్రతి ఒక్కరి జీవితంలో కీలకమని, చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు ఉపాధ్యాయుల సూచనలు పాటించేలా ప్రోత్సహించాలని అన్నారు. పాఠశాల స్థాయిలోనే మంచి అలవాట్లు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శైలమ్మ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

